# స్క్వేర్ ఆఫ్ a+1

-డాక్టర్ దేవరాజు మహారాజు

"నాన్నగారండి! మిమ్మల్ని కాసేపు డిస్టర్బ్ చెయ్యొచ్చా?" అంటూ గదిలోకి వచ్చాడు సౌరభ్. జబ్బుపడి కోలు కుంటున్న వాడి కళ్ళలో ఇంకా నీరసం కనిపిస్తూనే ఉంది. స్కూల్ ప్రిన్సిపాల్ వాడికి రెస్ట్ శాంక్షన్ చేశారు. ఆడుకున్న వీడియో గేమ్స్ బోరుకొట్టి ఉంటాయి. అందుకే నా దగ్గరికి వచ్చాడు. ఈ డాడీ మమ్మీలు నడుస్తున్న కాలంలో కావాలనే మా వాడికి నాన్నగారు అనేది అలవాటు చేశాం. దానికి వాడు అండీ కూడా కలిపి 'నాన్నగారండి' - చేశాడు.

తల్లిదండ్రులు తీరిక లేకుండా వారి వారి పనుల్లో ఉంటారు. నిజమే. కాని పిల్లలకు కొంత సమయం కేటాయించాలి, తప్పదు. టెలివిజన్, క్రికెట్, సినిమాలు, స్నేహితులు, స్వీట్స్... పిల్లల్ని ఎక్కువగా ఆకర్షించే విషయాలు. కాని అమ్మా, నాన్నలతో, నానమ్మా అమ్మలతో మామయ్య, తాతగార్లతో గడపాలని కూడా వారికి ఉంటుంది. వారి ప్రేమని చవిచూడాలని, తమ ఆలోచనల్ని వాళ్ళ ముందు వ్యక్తీకరించుకోవాలనీ అనుకుంటారు.

"రా.. నానా" అన్నాను. పుస్తకం పక్కన పెట్టి, వాణ్ణి దగ్గరకి తీసుకుంటూ.

"నాన్నగారండీ మీరు మనసులో అనుకున్న నెంబర్ ఏదైనా సరే నేను చెప్పగలను" అన్నాడు వాడు.

"అబ్బో గొప్ప విద్యే నేర్చావ్. అయినా లెక్కల్లో అందరికన్నా తక్కువ మార్కులు తెచ్చుకునేది నువ్వే కదా.. నీకింత పరిజ్ఞానం ఎలా పెరిగిందీ?"

"ఆఁ- అదేంకాదు. అందరికంటే లాస్ట్ ఆ శిరీష్ గాడు.. సరే ముందు మీరొక నెంబరనుకోండి!"

"సరే టూ. అనుకున్నాను"

"అయ్యో! నాన్నారండీ. మీరు నాకు చెప్పగూడదు. మీ మనసులోనే అనుకోండి."

"ఆఁ.. సరే అయితే, అనుకున్నాను."

"దానికి స్క్వేర్ చెయ్యండి"

"ఆఁ చేశాను" 2x2=4 అని మనసులో అనుకున్నాను.

"ఆ నెంబర్ గుర్తుంచుకోవాలి. మర్చిపోగూడదు. సరేనా.."

"ఆ.. సరే"

"అయితే మీరు మొదట అనుకున్న నెంబర్‌కు ఒకటి కలపండి"

"ఓ.. యస్!" 2+1 = 3 అనుకున్నాను.

"ఇప్పుడు మళ్లీ స్క్వేర్ చెయ్యండి"

3x3=9 అనుకుని, "ఓ.కె- వాట్ నెక్ట్స్"

"మొదట స్క్వేర్ చూసిన నెంబరుకు, ఇప్పుడు స్క్వేర్ చేసిన నెంబర్‌కు తేడా ఎంతో చూసుకోండి - నాకు చెప్పొద్దు"

"తేడానా ఆఁ చూశాలే" 9-4=5

"ఆఁ- ఇప్పుడు మీకు వచ్చింది ఆడ్ నెంబర్ కదా?"

"అరె నిజమే! బేసి సంఖ్యే. నీకెలా తెలిసింది నానా"

"ఆఁ- ఇప్పుడు చెప్పండి. ఆ నెంబర్‌తో - నేను మీరనుకున్న నెంబర్ చెబుతాను."

"ఆ రెండు స్క్వేర్స్‌కు డిఫరెన్స్-ఫైవ్ వచ్చింది నానా"

"అయితే మీరనుకున్న నెంబర్ టు" టపీమని చెప్పాడు సౌరబ్.

"అరె. ఎలా చెప్పావురా? అయినా అంతా ఉత్తది. మొదట నేనే చెప్పాను కదా నేను అనుకున్న నెంబరు టూ అని.."

"అదేం కాదు. మీరు ఇంకో నెంబర్ అనుకోండి- కావలిస్తే.. ఏదనుకున్నా చెప్తాను" - వాడి గొంతులో నిబ్బరం ఉంది. ఆత్మస్థైర్యం ఉంది. ఈ తరం పిల్లల్లో అనూహ్యమైన తెలివితేటలున్నాయి. వాటిని క్రమ పద్ధతిలో ఎదగనివ్వాలి. సరైన వాతావరణం కల్పించాలి అని అనిపించింది.

"సరే - ఎలా చెప్పావో చెప్పు"

"ఏముంది, డిఫరెన్స్ ఫైవ్ అన్నారు కదా? అందులో వన్ మైనస్ చేశాను. ఫోర్ వస్తుంది. ఫోర్‌లో హాఫ్ టూ కదా! అందుకే మీరనుకున్న నెంబరు ఖచ్చితంగా టూయే."

5-1=4/2=2

నేను ఆలోచనలో పడ్డాను. ఇంత చిన్న వయసులో వీడికి స్క్వేర్ ఆఫ్ a+1 సూత్రం చెప్పిందెవరు? సూత్రం గురించి తెలిసి ఉండదు. గణిత శాస్త్రవేత్త క్లిఫర్డ్ దీన్ని సూత్రీకరించాడని కూడా తెలిసి ఉండదు. కాని, విషయం తెలుసుకుని ఉంటాడు.

a అనేది unknown number. ఏదైనా అనుకోవచ్చు. సౌరబ్ నన్ను వదలలేదు. అలా అరగంట దాకా నేను ఏదో నెంబరు అనుకుని దానికి స్క్వేర్ కట్టలేక తికమక పడుతూ ఉంటే పడీ పడీ నవ్వాడు. "అందుకే మీరు చిన్న నెంబరు అనుకోవాలి!" అని ఉచిత సలహా కూడా ఇచ్చాడు. "లేదా మీ కాలిక్యులేటర్ తీయండి. పెద్ద పెద్ద నెంబర్లు ట్రై చేద్దాం" అన్నాడు. కాసేపటికి అలసిపోయాడు. వాడి పరిస్థితి చూసి "కాసేపు పడుకో నానా" అన్నాను. "ఆపిల్ తింటావా?"- అని అడిగాను. సరేనని వెళ్ళాడు. ఫ్రిజ్ డోర్ తీసిన చప్పుడు. మళ్ళీ వేసిన చప్పుడు వినిపించింది. ఆపిల్ తీసుకుని సౌరబ్ బెడ్‌రూంలోకి వెళ్ళిపోయుంటాడు.

సరే ఈ స్క్వేర్ ఆఫ్ a+1 ను మరో రకంగా ఆలోచిద్దాం- a అనేవాడు సగటు మనిషి అయితే ప్లస్ వన్ అనేవాడు శాస్త్రజ్ఞుడు. సృజనకారుడు, మేధావి, చిత్రకారుడు, సాంకేతిక నిపుణుడు... సామాన్యుడి కంటే ఉన్నతమైన వాడు ఎవరైనా కావొచ్చు. వాడిలో ఒక ప్లస్ అదనంగా ఉండాలి. ఆ వన్ మైనస్ చేస్తే వాడు మనిషే కావాలి. మనిషి కన్నా దిగజారకూడదు. అందులో ఆ విషయం కూడ నిక్షిప్తమై ఉంది.

ఇకపోతే దేవుడనే నమ్మకాన్ని a అనుకుందాం. దేవుడు లేదని నమ్మే మనిషిని (శాస్త్రవేత్త, నిరీశ్వరవాదీ ఎవరైనా కావచ్చు) ప్లస్ వన్ అనుకుందాం. ఎందుకంటే ఈ మనిషి తనను తాను ఆ భావన కంటే కొంత ఎదిగిన వాడుగా ఊహించుకుంటూ ఉంటాడు. ఇప్పుడు తమాషా చూడండి.

దేవుడు లేడంటే మనిషి ఉట్టి - 1 (వన్)

0+1 = 1 మనిషి ఒంటరిగా మిగిలిపోతాడు. a స్థానంలో కూడా ఏదో తెలియని ఒక మహత్తర శక్తి ఉందనుకుంటే మనిషిక్కూడా కొండంత ధీమా! జీరోకు ప్లస్ కావడంకన్నా ఏదో ఒక నెంబర్‌కు ప్లస్ కావడం ఘనంగా ఉంటుంది కదా! ఇక్కడ మరొక రహస్యం ఉంది. దేవుడూ నిరీశ్వరవాదులు ఎడమొగం పెడ మొగంగా ఉంటారు. కాని వారు చాలా దగ్గరి మిత్రులు. వారి స్నేహం oddగా తప్ప evenగా ఉండదు. రాక్షసు లంతా దేవుణ్ణి ఎదిరించే దేవుడిలో ఐక్యమయ్యారని కదా చెబుతారూ?

a = అంటే దేవుడనే ఎందుకు అనుకోవాలి?

మనిషికి ఇంకా అర్థంకాని రహస్యాలనుకుందాం (దేవుడన్నా మనిషికి అర్థంకాని రహస్యమే కదా?)

మనిషి శాస్త్రీయ జీవిత వాక్యం అంతా తయారయ్యింది. కాని మొదటిసారి జీవి ఎలా రూపుదిద్దు కుంది? కొన్ని నిర్జీవాల చర్యల వల్ల సమ్మేళనాల వల్ల జీవి ఎలా ఉద్భవించింది- అనేది ఒక చిన్న ఖాళీ (డాష్ - రహస్యం)గా వెక్కిరిస్తోంది. ఆ ఖాళీలోనే "దేవుడు" అనే భావన వచ్చి తిష్టవేసింది. యుగాలు గడిచాయి. కాని రహస్యం బద్దలవలేదు. దేవుడు బయటికి రాలేదు. (రాలేడు కూడా! ఎందుకంటే దేవుడనే భావనకు రూపుదిద్దుకుంది మనిషి గనక... దాన్ని విడగొట్టుకునే పని కూడా మనిషిదే!)

బయటికి వచ్చాడని చెప్పుకుంటున్న దేవుడు, మనిషి భ్రమల మీద మాత్రమే నడుచుకుంటూ వచ్చాడు.

మనిషి ప్రశ్నలకు నేరుగా సమాధానమిస్తూ రాలేదు.

ప్రకృతి a అయితే మనిషి +1 గా జీవిస్తున్నడు- అని అనిపించింది.

లోపలికి వెళ్ళి అంకెల గారడీ చేసిన సౌరబ్‌ను చూశాను.

వాడు గాఢ నిద్రలో ఉన్నాడు. వాడికి రెస్ట్ అవసరం. అయినా నా ఆలోచనలన్నీ వాడితో పంచుకోవాలంటే ఇంకా సమయం ఉంది. వాడింకా ఎదగాలి. ఎదగని పెద్దలు కోట్ల సంఖ్యలో ఉన్నప్పుడు, ఎదగాల్సిన పిల్లల గురించి అప్పుడే తొందరెందుకూ? వాణ్ణి లేపకుండా బయటికి వచ్చాను.

■

## ఆత్మబంధువు

వర్షంలో రాంజీ
తడిసినా తెచ్చాడు
నా పత్రికని.
పోస్టుమెన్ కాక
ప్రజాబంధువు వేరు
లేరు గ్రామంలో.
ఎండా, వానతో
ఏడాది పొడుగూత
వీడని 'స్నేహం'.
అందుకే నాకు
'ఆత్మబంధువు' సదా
అతడే మరి!

-శ్రీమాన్ శ్రీకాశ్యప